సంగారెడ్డి

నమస్తే తెలంగాణ | మంగళవారం 15 అక్టోబర్ 2024
TUESDAY, OCTOBER 15, 2024

## డీఎస్సీ అభ్యర్థులకు నేడు పాఠశాలల కేటాయింపు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 14: డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలలను కేటాయించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటన జారీ చేస్తూ ఈ నెల 15న ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో నూతన ఉపాధ్యాయులకు పాఠశాలలను కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. 1:1 నిష్పత్తిలో నియామకపత్రాలు అందుకున్న అన్ని కేటగిరీల స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లు, ఎస్జీటీలు, పీఈటీ ఉపాధ్యాయ అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

## నేటి నుంచి 'గాలికుంటు' నిరోధక టీకాలు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 14: జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి నవంబర్ 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వనున్నట్టు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 72 బృందాలను టీకాల కోసం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మూడు నెలల పైబడిన అన్ని గోజాతి, గేదె జాతి పశువులకు టీకాలు వేయించాలన్నారు.

## వ్యక్తి అదృశ్యం

గుమ్మడిదల, అక్టోబర్ 14: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమడుగులో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రాకారం.. దోమడుగు గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 12వ తేదీన అతడి భార్య అమ్మగారింటికి వెళ్లింది. 13న ఇంట్లో సాయంత్రం సమయంలో దస్తగిరి తన అమ్మకు సీతాఫలాలు తెస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దస్తగిరి భార్య సాహెదా బేగం 14న తన ఇంటికి రావడంతో భర్త కనిపించలేదు. ఈ విషయాన్ని అత్తకు తెలియజేయగా సీతాఫలాలు తీసుకువస్తానని చెప్పిన వ్యక్తి ఇప్పటివరకు రాలేదని బదులు ఇవ్వడంతో చుట్టుపక్కల తెలిసిన వారు, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అమీన్‌పూర్ అక్టోబర్ 14: నర్రెగూడెం చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్రెగూడెం జంబి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిపై తేలుతున్నదని తెలుసుకున్న కానిస్టేబుల్ వెంకటేశం అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు దవాఖానకు తరలించి భద్రపరిచారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కంగ్టి తహసీల్దార్ బదిలీ

కంగ్టి, అక్టోబర్ 14: కంగ్టి తహసీల్దార్ విష్ణుసాగర్ సోమవారం బదిలీ అయ్యారు. గతేడాది కంగ్టి తహసీల్దార్‌గా వచ్చిన విష్ణుసాగర్ 14 నెలల పాటు విధులు నిర్వహించారు. బదిలీపై అందోల్ మండలానికి వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన విష్ణుసాగర్‌కు స్థానిక ఉద్యోగులు శాలువాతో సత్కరించి సన్మానం చేశారు.

## సంజీవరావుపేట్ ఘటనలో ముగ్గురిపై వేటు

నారాయణఖేడ్, అక్టోబర్ 14: నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్‌లో నీటి కలుషితం కారణంగా ఇద్దరు మృతి చెంది, వంద మంది వరకు అస్వస్థతకు గురైన ఘటన నేపథ్యంలో ఇద్దరు ఏఈఈలు, పంచాయతీ కార్యదర్శిపై వేటు పడింది. మొరాయించిన మిషన్ భగీరథ మోటార్లను పునరుద్దరించడంలో జాప్యం చేయడంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం చేసినందుకు నారాయణఖేడ్ గ్రిడ్ ఏఈఈ రవికుమార్, ఇంట్రా ఏఈఈ శ్రీకాంత్‌లను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నీటి సరఫరా నిర్వహణపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సంజీవన్‌రావు పేట్ పంచాయతీ కార్యదర్శి నర్వ నాగలక్ష్మిని సస్పెండ్ చేస్తూ కలెక్టరు వల్లూరు క్రాంతి ఉత్తర్వులిచ్చారు. ఎంపీవో ఇందిరమ్మ, గ్రామ ప్రత్యేకాధికారి వెంకటరెడ్డిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీవో సాయిబాబాను కలెక్టర్ ఆదేశించారు.

## నివాళి.. పరామర్శ

నిజాంపేట్, అక్టోబర్ 14: మండల పరిధిలోని మునిగెపల్లి గ్రామానికి మాజీ ఉప సర్పంచ్ నాయికోటి దుర్గయ్య భార్య పెంటవ్వ సోమవారం మరణించడంతో ఆమె భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ సర్పంచ్‌లు జగదీశ్వర చారి, నవాబ్ పాటిల్, నాయకులు రాంచందర్ పాటిల్ తదితరులున్నారు.

# ఆగిన ఉద్యమకారుడి ఊపిరి

- అల్లం నవాజ్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు
- కన్నీటి పర్యాంతమైన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్
- భారీగా తరలివచ్చిన వివిధ పార్టీల నేతలు

నవాజ్‌రెడ్డి(ఫైల్)

తాటిపల్లిలో అల్లం నవాజ్‌రెడ్డి అంత్యక్రియాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

నవాజ్‌రెడ్డి అంత్యక్రియల్లో పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మునిపల్లి, అక్టోబర్ 14: బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి తుదిశ్వాస విడిచేవరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, అందోల్ మాజీ ఎమ్మెల్యేలు బాబూమోహన్, క్రాంతి కిరణ్ వెంటే ఉంటూ బీఆర్ఎస్ బలోపేతానికి ఎంతో కృషి చేసిన వ్యక్తి అల్లం నవాజ్‌రెడ్డి ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఉద్యమ కాలంలో మండలంలో తెలంగాణ దూంధాం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రతి పల్లెకూ బీఆర్ఎస్‌ను చేర్చాడు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా సుమారు 20 సంవత్సరాలు కొనసాగారు. 2013 సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్‌కు చెందిన ఓ బడా నాయకుడిపై ఒక్క ఓటుతో గెలిచి గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపించాడు. అల్లం నవాజ్‌రెడ్డి మృతితో మండల నాయకులు కన్నీటి పర్యాంతమయ్యారు. మునిపల్లి మండలంలో బీఆర్ఎస్ అంటే అల్లం నవాజ్ రెడ్డి.. అల్లం నవాజ్ రెడ్డి అంటే బీఆర్ఎస్‌గా పేరు తెచ్చుకున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశారు. మునిపల్లి మండలానికి చెంది న బీఆర్ఎస్ నాయకులతోపాటు ఇతర పార్టీ నాయకులు నవాజ్ రెడ్డి ఇంటికి తరలివెళ్లారు. రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి అల్లం నవాజ్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చచారు.

**అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే**

బీఆర్ఎస్ మునిపల్లి మండల అధ్యక్షుడిగా 20 సంవత్సరాలు పని చేసి ఆదివారం అర్ధ రాత్రి కన్నుమూసిన అల్లం నవాజ్‌రెడ్డి అంత్యక్రియల్లో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అల్లం నవాజ్ రెడ్డి లేని లోటు బీఆర్ఎస్‌కు తీరని లోటని కన్నీరు పెట్టుకున్నారు. మండలంలో తొలి ఉద్యమకారుడు, బీఆర్ఎస్ జెండా పట్టి ప్రజల్లో ఉత్సాహం నింపిన అల్లం నవాజ్ రెడ్డి నేడు మన మధ్య లేకపోవడం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతోపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నవాజ్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

# కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన నేతలు

జహీరాబాద్, అక్టోబర్ 14: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును జహీరాబాద్ పట్టణ మాజీ కౌన్సిలర్, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు నామ రవికిరణ్ దంపతులు కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు స్వగృహంలో కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరీశ్ రావు దంపతుల చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌ని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్వీ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకుడు చెన్నారెడ్డి

మాజీ మంత్రి హరీశ్‌రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నేతలు ఆదర్శ్‌రెడ్డి, అంజయ్య, కుమార్‌గౌడ్

హరీశ్‌రావుకు చిత్రపటాన్ని అందజేస్తున్న జహీరాబాద్ బీఆర్ఎస్ నేత నామ రవికిరణ్ దంపతులు

# అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్‌షెట్కార్

కల్హేర్, అక్టోబర్ 14: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకొని దేశ ప్రతిష్టను ప్రపంచం నలుమూలలా చాటాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ శెట్కార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాపర్తి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేషం, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్యం, రాష్ట్ర వ్యసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, మాజీ సర్పంచ్ శ్యామ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ శ్యామమ్మ, నాయకులు దేవదాస్, సాయిబాబాగౌడ్, శ్రీకాంత్, జైపాల్ ఉన్నారు.

# గురుజువాడలో దుర్గామాత నిమజ్జనం

గురుజువాడలో అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

కోహీర్, అక్టోబర్ 14: దేవీశరన్నవ రాత్రోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని గురుజువాడ గ్రామంలో దుర్గామాత నిమజ్జనాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. కోలాట, బోనాల ఊరేగింపు, తదితర సంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి బావిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో దత్తాత్రి, శ్రీనివాస్, వైద్యనాథ్, వెంకట్, నర్సింహులు పాల్గొన్నారు.

# కర్ధనూర్‌లో భారీగా ట్రాఫిక్‌జాం

కర్ధనూర్ బ్రిడ్జి వద్ద ఏర్పడిన ట్రాఫిక్‌జాం

పటాన్‌చెరు, అక్టోబర్ 14: కర్ధనూర్ ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. సోమవారం పటాన్‌చెరు మండలం కర్ధనూర్ ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు జంక్షన్ వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఒక వైపుగా శంకర్‌పల్లి- పటాన్‌చెరు వాహనాలు, మరో పక్క ఐడీఏ పాశమైలారం నుంచి కర్ధనూర్ వచ్చే వాహనాలతో జంక్షన్ వద్ద ట్రాఫిక్‌జాం ఏర్పడింది. సాయంత్రం 5 గంటలనుంచి 6.30 గంటల వరకు పాశమైలారం నుంచి వేలాది పరిశ్రమల వాహనాలు వరుసగా వస్తాయి. అదే సమయంలో బీడీఎల్, శంకర్‌పల్లి వైపునుంచి భారీగా వాహనాలు ప్రధాన రోడ్డునుంచి వస్తున్నాయి. పటాన్‌చెరు వైపునుంచి వస్తున్న వాహనాలు కర్ధనూర్ జంక్షన్ బ్రిడ్జి కింద ఎదురెదురవుతున్నాయి. వర్షంకూడా పడటంతో రోడ్లన్నీ చిత్తడిగా మారి వాహనాలు ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొన్నది. నలువైపులా రెండు కిలో మీటర్ల చొప్పున వాహనాలు నిలిచిపోయాయి. బీడీఎల్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండు గంట ల పాటు ప్రయాణికులు, పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులు బస్సుల్లోనే కూర్చుండిపోయారు. ట్రాఫిక్‌జాంలో మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్ధనూర్ బ్రిడ్జి వద్ద సాయంత్రం సమయంలో ట్రాఫిక్‌జాం సాధారణంగా మారిందని డ్రైవర్లు వాపోతున్నారు. సాయంత్రం సమయంలో కర్ధనూర్ బ్రిడ్జివద్ద పరిశ్రమల వాహనాల రాకపోకలను, పటాన్‌చెరు, శంకర్‌పల్లి రోడ్డుపై వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తేనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తేనే వాహనాలు సక్రమమైన పద్ధతిలో వెళ్తాయని వాహనదారులు చెబుతున్నారు.

# ప్రజావాణికి 35 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 14: ప్రజావాణిపై దసరా ప్రభావం కనిపించింది. అతి తక్కువ సంఖ్యలో అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాధులను అధికారులకు అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మొత్తం 35 అర్జీలు రాగా వాటిని అదనపు కలెక్టర్ మాధురితో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతి స్వీకరించారు. ఆయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొన్ని నెలలుగా పట్టా పాసుపుస్తకం ఇప్పించాలని ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్న ముగ్గురికి కలెక్టర్ పట్టా పాసు పుస్తకాలను అందజేశారు. బాధితుల అర్జీలను పరిశీలించిన కలెక్టర్ వారి అభ్యర్థన మేరకు పట్టాలు అందించి సమస్యను పరిష్కరించారు. డీఆర్వో పద్మజారాణి, ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

హత్నూర, అక్టోబర్ 14: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హత్నూర మండలం దేవులపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. హత్నూర పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ.షఫీ(46) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. షఫీకి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉండగా పెద్ద కుమార్తె వివాహం కాగా రెండో కుమార్తె నిశ్చితార్థం జరిగినట్లు తెలిపారు. వివాహ సమయం దగ్గర పడుతుండటంతో ఆర్థికస్థోమత బాగా లేక తన వాటాకింద రావాల్సిన భూమిని తనకు ఇవ్వాలని తన కుటుంబ సభ్యులను కోరాడు. అందుకు వారు నిరాకరించడంతో కొన్నిరోజులుగా మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో సోమవారం గ్రామ శివారులోని ఎర్రకుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

## పిడుగుపాటుతో యువ రైతు మృతి

సంగెపు రవి (ఫైల్)

కల్హేర్, అక్టోబర్ 14: బర్రెకు మేత కోసం పొలం వద్దకు వెళ్లిన యువ రైతుపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేట్ గ్రామానికి చెందిన సంగెపు రవి(26) బర్రెకు పచ్చిమేతను తీసుకువచ్చేందుకు సాయంత్రం గ్రామ శివారులోని రామేశ్వరం చెరువు కింద గుంతసేను సమీపంలోని పొలాలకు వెళ్లాడు. గడ్డి కోస్తున్నప్పుడు ఉరుములు మెరుపులతో వర్షం రావడంతో కోసిన గడ్డిని మోపు కట్టుకొని వస్తున్న క్రమంలో పిడుగు పడడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య భూమిక, పెద్ద కూతురు అలేక(2), 45 రోజుల చిన్నారి ఉంది.

# భూగర్భ జలాలను పెంచుకోవాలి

గౌటిగార్‌పల్లిలో బావిని పరిశీలిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

కోహీర్, అక్టోబర్ 14: భూగర్భ జలాలను పెంచడం ద్వారా మూడు పంటలకు పుష్కలంగా సాగు నీరు లభిస్తుందని జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మాజీ వైస్ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌటిగార్‌పల్లి గ్రామంలో సోమవారం వాటర్ షెడ్ ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎత్తిపోతల ప్రాజెక్టులను నిర్మించేందుకు చాలా ఖర్చు అవుతుందని, కానీ చెక్ డ్యామ్‌లు, బావుల పూడికతీతతో కేవలం రూ.15వేల ఖర్చుతో ఒక ఎకరానికి సాగు నీటిని అందించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చెక్ డ్యామ్‌లు నిర్మించాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఆదివాసీలకు సాగు నీరు అందాలంటే నీటి వనరులను సంరక్షించాలన్నారు. రాజస్థాన్ ఎడారి ప్రాంతం అయినా చతుర్విధ జలప్రక్రియ ద్వారా భూగర్భజలాలను పెంచి లక్షల ఎకరాలకు మూడు పంటలకు సాగు నీటిని అందిస్తున్నారన్నారు. ఇటీవల మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాగునీటి రంగం నిపుణులతో చర్చించామన్నారు. ఆయన వెంట ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, రామ్‌కిషన్, మెరళీమనోహర్, మాజీ సర్పంచ్ రాచయ్య, నర్సింహులు, అప్సర్ ఉన్నారు.

# జాతీయ అవార్డుకు శిల్పకళాకారుడి ఎంపిక


మోడ్రన్ హస్బండ్రి -3' శిల్పాన్ని చెక్కుతున్న శిల్పకారుడు హోతి బస్వరాజ్

జహీరాబాద్, అక్టోబర్ 14: న్యాల్‌కల్ మండల కేంద్రానికి చెందిన యువ శిల్ప కళాకారుడు డాక్టర్ హోతి బస్వరాజ్ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ద ఇండియన్ అకాడమీ ఆఫ్ ఫైన్ 89వ జాతీయ పోటీల్లో బస్వరాజ్ తయారు చేసిన 'మోడ్రన్ హస్బండ్రి -3'(నాగలిపై ఎద్దుతో తయారు చేసిన శిల్పం) జాతీయ స్థాయిలో రెండో బహుమతికి ఎంపికైంది. అవార్డుతోపాటు రూ.51 వేల నగదు అందించనున్నట్టు బస్వరాజ్ పేర్కొన్నారు. ఆధునిక పద్ధతులతో వ్యవసాయంలో అధిక దిగుబడి వస్తున్నా మానవ శికి శాపంగా మారిందన్నారు. రసాయనాలతో పండించిన ధాన్యాన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల ఆయుష్యు తగ్గిపోతుందన్నారు. రోజురోజుకూ పశువుల సంతతి తగ్గిపోతున్నదని, సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించాలనే ఉద్దేశంతో నాగలిపై ఎద్దు శిల్పాన్ని చెక్కినట్లు తెలిపారు. ద ఇండియన్ అకాడమీ ఆఫ్ ఫైన్ నిర్వాహకులు ఈ శిల్పాన్ని జాతీయ స్థాయిలో రెండో బహుమతికి ఎంపిక చేశారన్నారు. ఈ నెల 26న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జరిగే కార్యక్రమంలో ఆ రాష్ట్ర క్యాబినెట్ మంత్రి కుల్దీప్‌సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. తన శిల్పానికి జాతీయస్థాయిలో అవార్డు రావడం సంతోషంగా ఉందని బస్వరాజ్ ఆనందం వ్యక్తం చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు

జహీరాబాద్, అక్టోబర్ 14: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన పద్మమ్మ, జహీరాబాద్ పట్టణ సమీపంలోని రంజోల్‌కు చెందిన తుల్జమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.5.50 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# వృత్తి విద్యకు అధిక ప్రాధాన్యం

వృత్తి విద్య శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో శిక్షకురాలు సమీరాఖాన్

బొల్లారం, అక్టోబర్ 14: నూతన విద్యా విధానంలో వృత్తి విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని బొల్లారం ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. రిటైల్ రంగంలో 10 రోజుల వృత్తి విద్య శిక్షణ పూర్తి చేసుకున్న కళాశాల ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులను సోమవారం ఆమె ప్రత్యేకంగా అభినందించారు. నూతన విద్యా విధానంలో వృత్తి విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని తెలిపారు. శిక్షకురాలు సమీరా బేగం ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో సూపర్ మార్కెట్లు, కిరాణా జనరల్ స్టోర్ వంటి వ్యాపార సముదాయాల్లో వృత్తివిద్యపై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న 14 మంది ఒకేషనల్ విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఒకేషనల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# తుల్జాపూర్‌కు భక్తుల పాదయాత్ర

తుల్జాపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న ప్రజలు

కంగ్టి, అక్టోబర్ 14: మండల కేంద్రమైన కంగ్టి నుంచి సుమారు 150 మంది యువకులు, పెద్దలు సోమవారం మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్ భవానీ మాత ఆలయానికి పాదయాత్రగా తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా పాదయాత్రగా వెళ్తున్నామని చెప్పారు. రోజూ 50 కిలో మీటర్ల చొప్పున నడుస్తూ 18వ తేదీ పౌర్ణమి రోజుకు తుల్జాపూర్‌లోని భవానీమాత ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకుంటామని తెలిపారు. నాలుగు రోజులపాటు కర్ణాటక, మహారాష్ట్రలోని ప్రాంతాల్లో బస చేస్తామని చెప్పారు. భక్తులకు భోజన సదుపాయాన్ని జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్‌శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి కల్పించారు.

# పాదయాత్ర చేస్తున్న కార్యకర్తకు సన్మానం

పాదయాత్రగా వెళ్తున్న యువకుడిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, అక్టోబర్ 14: గుమ్మడిదల మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎండీ యూనిస్ ఎమ్మెల్సీ కవిత ఆయురారోగ్యాలతో త్వరగా కోలుకొని ప్రజల్లోకి రావాలని ఆకాంక్షిస్తూ సోమవారం గుమ్మడిదల సీజీఆర్ క్యాంపు కార్యాలయం నుంచి కొల్చారం దర్గా వరకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, జిన్నారం వెంకటేశ్‌గౌడ్ శాలువా, పూలమాలతో సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, భాస్కర్ రెడ్డి, నరహరి, మొగులయ్య, శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి, యాదగిరి, వెంకట్ రెడ్డి, పెంటయ్య పాల్గొన్నారు.

# వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కాసాలలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్తులు

హత్నూర, అక్టోబర్ 14: మండలంలోని కాసాల గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం గోపూజ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, దేవతారాధన, అగ్ని ప్రతిష్ఠ హోమం, జలాదివాసం, ప్రదోష పూజ, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాగగా గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# తండా సమస్యల పరిష్కారానికి కృషి


పీచెర్యాగడి తండాలో పర్యటిస్తున్న వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి

కోహీర్, అక్టోబర్ 14: పీచెర్యాగడి తండాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సజ్జాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పీచెర్యాగడి కొత్త, పాత తండాలను సందర్శించి గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. రెండు తండాల్లో మురుగు నీటిని బయటకు పంపించేందుకు సైడ్ డ్రైన్ పనులను ప్రారంభిస్తామన్నారు. రోడ్లను త్వరలో కూడా బాగు చేస్తామని హామీనిచ్చారు. సొసైటీ డైరెక్టర్ వీరారెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వినోద్‌రాథోడ్ ఉన్నారు.

# విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ

రామచంద్రాపురం, అక్టోబర్ 14: బీహెచ్ఈఎల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గుర్తింపు కోసం ఐడీ కార్డులను ప్రిన్సిపాల్ రవీందర్ అందజేశారు. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఆయన సొంత ఖర్చుతో ఐడీ కార్డులను చేయించారు. సోమవారం కళాశాల ఆవరణంలో విద్యార్థులకు ఐడీ కార్డులను అందజేసి రోజూ ఐడీ కార్డులు వేసుకొని కాలేజీకి రావాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమానత్వం, రెగ్యులారిటీ, విద్యార్థుల గుర్తింపు సులభతరమవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.